క్లుప్తంగా

పీవీకి భారతరత్న పట్ల హర్షం

మహారాణిపేట : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం పట్ల బీజేపీ మెడికల్ రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. గొప్ప మేధావుల్లో పీవీ ఒకరని, రాజకీయ వేత్తగానే కాకుండా గొప్ప మానవతావాదిగా పీవీ ప్రసిద్ధి గాంచారన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమన్నారు. ఆయనకు భారతరత్న ఇవ్వడం పట్ల ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

డాక్టర్ రవిరాజ్‌కు మహోపాధ్యాయ అవార్డు



తెలంగాణ గవర్నర్ తమిళసై నుంచి అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ రవిరాజ్

మహారాణిపేట : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ జీవీ రవిరాజ్‌కు మరో అవార్డు లభించింది. కిడ్నీ రోగులకు అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా డాక్టర్ రవిరాజ్‌కు మహోపాధ్యాయ అవార్డును తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రదానం చేశారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన ఇండియన్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ సదరన్ చాప్టర్ వార్షిక సదస్సు ప్రారంభోత్సవ వేడుకల్లో డాక్టర్ రవిరాజ్ ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిరాజ్‌ను సహచర వైద్యులతో పాటు విశాఖ వాసులు అభినందనలతో ముంచెత్తారు.

ఎన్నికల పోస్టర్ ఆవిష్కరణ



మాట్లాడుతున్న పెదపెంకి శివప్రసాద్

డాబాగార్డెన్స్ : సార్వత్రిక ఎన్నికల పోస్టర్‌ను బహుజన్ సమాజ్ పార్టీ విశాఖ జిల్లా పార్లమెంట్ అభ్యర్థి పెదపెంకి శివప్రసాద్ తన కార్యాలయంలో పలు నియోజకవర్గాల అభ్యర్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బహుజన కులాల పాలన రావాలంటే రెండు కులాల పాలన పోవాలని, తద్వారా చట్ట సభల్లో బహుజనుల గళం విప్పవచ్చని చెప్పారు. వెనుకబడిన కులాలకు రాజ్యాధికార సాధన కోసమే కాన్షీరాం బీఎస్పీని స్థాపించారని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో బీఎస్పీ పోటీ చేస్తుందని తెలిపారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్లం తిరుపతిరావు, ఎస్. కోట ఇన్‌చార్జి బోని కృష్ణ, కదిరి రాము, పెద్దాడ కనకమహాలక్ష్మి, సవరల రమేష్, రామచంద్రరావు, ధనుంజయ్, ఎంవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.2.1 లక్షల విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్వో అప్పలనాయుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన కె.సంకేత, శ్రావ్య రూ.1,00,116 విరాళం, శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం గేదెలపేటకి చెందిన గేదెల రాజేష్ దంపతులు రూ.1,10,000 విరాళం శనివారం అందజేశారు. సంబంధిత విరాళాలను సింహగిరిపై ఉన్న పీఆర్‌వో కార్యాలయం వద్ద నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు బాండ్‌లను పీఆర్వో అప్పలనాయుడు అందజేశారు. అనంతరం దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

ఇది కదా అభివృద్ధి

ఆవిష్కరణలు.. ప్రారంభోత్సవాలు

- 41వ వార్డు జ్ఞానాపురంలో జోరుగా అభివృద్ధి పనులు
- రూ. 1.92 కోట్లతో సామాజిక భవనం, సీసీ రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు, బీటీ రోడ్ల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



అభివృద్ధి పనుల శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ పూర్ణిమ

నిధులు	పనులు	ప్రాంతాలు
రూ.49.60 లక్షలు	కమ్యూనిటీ హాల్ నిర్మాణం	పాత లారీ యార్డ్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ
రూ.37 లక్షలు	డ్రైనేజీలు, కవర్ శ్లాబులు	జ్ఞానాపురం రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి ఎర్రిగెడ్డ వరకు
రూ.7లక్షలు	ఇంటర్నల్ సీసీ డ్రైనేజీలు	రైల్వే న్యూకాలనీ, సుబ్బలక్ష్మి కల్యాణ మండపం రహదారి
రూ. 12.70 లక్షలు	సీసీ డ్రెయిను	సెబాస్టియన్‌కాలనీ, బాబూ కాలనీ ప్రాంతాలు
రూ.85.12 లక్షలు	బీటీ రోడ్డు, విద్యుత్ లైట్లు,	రంగులు కాన్వెంట్ కూడలి నుంచి జ్ఞానాపురం ఎఫ్‌సీఐ గిడ్డంగి వరకు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలోని పలు ప్రాంతాల్లో స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆధ్వర్యంలో శనివారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, జోన్-5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 1.92 కోట్ల వ్యయంతో సామాజిక భవనం, సీసీ రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు, బీటీ రోడ్లు నిర్మించనున్నట్లు డీఈ భరణికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ గడచిన నాలుగున్నరేళ్లలో కోట్లాది రూపాయలతో నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశంతో పని చేస్తున్నామన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు తక్షణమే నిధులు సమకూరుస్తున్న సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం జగన్ సారథ్యంలో ప్రజలందరూ ఆనందంగా ఉండటమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి అందించడంలో సీఎం జగన్ ఆయనకు ఆయనే సాటి అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే సముద్రమంత తేడా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జీసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, నాయకులు వేళంగిణిరావు, లక్కోజీ కుమార్, శ్రీను, చిన్నారెడ్డి, ఏఈ సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ప్రభుదాస్, గంగాధర్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అభివృద్ధి బాగుంది..



గత ప్రభుత్వంలో కానరాని అభివృద్ధి నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతోంది. మౌలిక వసతులు కల్పిస్తున్నారు. వార్డును అందంగా తీర్చిదిద్దడంలో కార్పొరేటర్ ఎంతో కృషి చేస్తున్నారు. నిధులు సమకూర్చడంతో అభివృద్ధి వేగంగా జరుగుతోంది. జ్ఞానాపురం వెనుకటి రోజుల్లో చిన్నపాటి వర్షానికే నీట మునిగేది. నేడు చేసిన అభివృద్ధితో ప్రజలు సంతోషంగా ఉన్నారు.

– అన్నపూర్ణ, స్లీప్ గుర్తు వీధి, జ్ఞానాపురం

మళ్లీ సీఎంగా జగనన్నే వస్తాడు..



నేడు వార్డులో జరుగుతున్న సంక్షేమం–అభివృద్ధి చూసి మళ్లీ వైఎస్సార్‌సీపీకే ఓటు వేయాలని ఉంది. మళ్లీ సీఎంగా జగనన్నే వస్తాడు. ఆయన వస్తేనే మాలాంటి కుటుంబాల్లో మరింత వెలుగులు నింపుతాడు. పేదలకు న్యాయం జరుగుతుంది. కార్పొరేటర్, ఎమ్మెల్యే వార్డు అభివృద్ధికి శ్రమిస్తున్నారు. జగనన్న పాలన బాగుంది.

– కొట్టి దేవి, నికోలస్ వీధి, జ్ఞానాపురం,

హామీలన్నీ అమలు చేస్తాం..



ఎన్నికల హామీలు నెరవేర్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శతశాతం కృషి చేస్తుంది. మేయర్, ఎమ్మెల్యే అడిగిన వెంటనే నిధులు మంజూరు చేయడంతో శరవేగంగా అభివృద్ధి జరుగుతోంది. ప్రజలకు వైఎస్సార్‌సీపీపై మరింత నమ్మకం పెరిగింది. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే వాసుపల్లిని మళ్లీ గెలిపించుకుని సీఎం జగనన్నకు బహుమతిగా అందిస్తాం.

– కోడిగుడ్ల పూర్ణిమ, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్, జ్ఞానాపురం

జోరుగా ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు



సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లు

సీతంపేట: ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇంటి స్థలంపై సంపూర్ణ హక్కు కల్పించేలా సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సచివాలయ అడ్మిన్‌కు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదా కల్పించిన విషయం తెలిసిందే. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇది వరకు ఇచ్చిన ఇళ్ల పట్టాలోని లబ్ధిదారుడి వివరాలు, కేటాయించిన స్థలం వివరాలు, హద్దులు ఆన్‌లైన్‌లో పొందుపర్చుతున్నారు. జీవీఎంసీ 44వ వార్డు 238 ఎంటీసీ పాలెం సచివాలయంలో అడ్మిన్ రాజేష్, వీఆర్వో సురేశ్వరి ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జోరుగా జరుగుతోంది.

నేడు ఎరుకుమాంబ అమ్మవారి విగ్రహం ఊరేగింపు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఉత్సవ విగ్రహం ఆదివారం ఉదయం ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అల్లిపురంలో తయారు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా దొండపర్తిలోని ఆలయానికి తీసుకొస్తామన్నారు. 17వ తేదీన అమ్మవారికి క్షీరాభిషేకం, జలాభిషేకం నిర్వహించి 18వ తేదీ ఉదయం ప్రాణ ప్రతిష్ట చేస్తారని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ 1లో శనివారం గుర్తు తెలియని ఒక వ్యక్తి ఫిట్స్ వచ్చి పడిపోయాడు. ఇతడిని 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఆదేశాలతో ఎస్ఐ మధుసూదనరావు కేసు నమోదు చేశారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని, ఈ వ్యక్తి గురించి ఎవరికైనా తెలిస్తే విశాఖ రైల్వేస్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 94406 27547, 94934 74582 నంబర్లలో గానీ తెలియజేయాలని జీఆర్పీ ఎస్ఐ కోరారు.

19న కళాతపస్వి కె.విశ్వనాథ్ జయంతి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి

డాబాగార్డెన్స్ : కళా తపస్వి డాక్టర్ కె. విశ్వనాథ్ 94వ జయంతిని పురస్కరించుకుని 19వ తేదీన ఎంవీఆర్ ఈవెంట్స్, యాక్మీ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ×విశ్వనాథం×సినీ సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఈ మేరకు విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కళాభారతి ఏసీ ఆడిటోరియం వేదికగా ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించనున్న స్వరాభిషేకం సినీ సంగీత విభావరిని విజయవంతం చేయాలని కోరారు. ప్రముఖ ప్లే బ్యాక్ సింగర్, సంగీత దర్శకుడు నేమాని పార్థసారథికి కె. విశ్వనాథ్ సంగీత పురస్కారం అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో యాక్మీ ప్రతాప్, ఎంవీఆర్, కిన్నెర థియేటర్ అధినేత రఘురాం, ప్రముఖ తెలుగు ప్లేబ్యాక్ సింగర్, సంగీత దర్శకుడు నేమాని పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం



31వ వార్డు బొడ్డునాయుడుతోటలో మాబూ షైక్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



39వ వార్డు చిలకపేటకు చెందిన అప్పన్నకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : ఆదుకునేందుకు ఎల్లప్పుడూ మీ ముందుంటానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నియోజకవర్గ ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రజాదర్బార్‌లో వైద్య సాయం కోసం వచ్చే అర్జీలతో పాటు వార్డు నాయకుల ద్వారా తెలుసుకుని ఆర్థిక సాయం చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో 10 మందికి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. 33వ వార్డు అల్లిపురం మెయిన్‌రోడ్డులో నివాసం ఉంటున్న సాధనాల రఘు, 32వ వార్డు కుమ్మరవీధికి చెందిన కరక డోనశ్రీ, 31వ వార్డు బొడ్డునాయుడుతోటకు చెందిన మాబూ షైక్‌లకు ఒక్కొక్కరికీ రూ. ఐదు వేల చొప్పున వైద్య ఖర్చులు, మందుల కొనుగోలుకు అందజేశారు. అలాగే 34వ వార్డు అచ్చంపేట జెండా చెట్టు వీధికి చెందిన షేక్ బాషా, కొబ్బరితోటకు చెందిన అగ్రహారపు రాము, సూరాడ లక్ష్మణరావు, 30వ వార్డుకు చెందిన పిళ్లా అప్పయ్య వీధికి చెందిన చింతపల్లి వెంకటేష్, 37వ వార్డు చెంగల్రావుపేటకు చెందిన బేగం, 38వ వార్డు విపత్తువారి వీధికి చెందిన శ్రీశైలపు త్రివేణి, 39వ వార్డు చిలకపేటకు చెందిన దూడ అప్పన్నను ఎమ్మెల్యే పరామర్శించి ఒకొక్కరికి రూ.5వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేయడమే కాక భరోసా కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, ఆలయాల చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మాఘ మాసోత్సవాలు ప్రారంభం



విశేష అలంకరణలో ఛాయా,ఉషా సమేత సూర్యనారాయణమూర్తి

అల్లిపురం : వేంకటేశ్వర మెట్టపై వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో శనివారం మాఘ మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అలమేలు మంగమ్మ అమ్మవారి దేవాలయం అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి స్వామికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం ప్రత్యేకంగా నిర్వహించారు. అనంతరం కలశ పూజ చేపట్టి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు కేశవాచార్యులు మాట్లాడుతూ ఈ 16వ తేదీన రథ సప్తమి సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఉంటాయని తెలిపారు. అదే విధంగా 20వ తేదీన భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు తెలిపారు. సాయంత్రం శ్రీనివాస కల్యాణం ఉంటుందన్నారు. మాఘ పౌర్ణమి 24 శనివారం ప్రత్యేక సముద్ర స్నానాలు చేస్తారన్నారు. అదే రోజు సాయంత్రం శ్రీ భూ సమేత శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. విశేష పంచామృతాభిషేకాలు చేపట్టి అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు. అదే విధంగా 5వ ఆదివారం, అమావాస్య సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు ఉంటాయని తెలిపారు. భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అధ్యాత్మిక చింతనతోనే ప్రశాంత జీవనం

ఎంవీపీకాలనీ: సామవేదం షణ్ముఖ శర్మ హనుమద్వైభవ ప్రవచనాలు ఎంవీపీ కాలనీలో శనివారం కొనసాగాయి. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా షణ్ముఖ శర్మ హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనములు మూడు రోజులుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అధ్యాత్మిక చైతన్యం కలిగివుండాలన్నారు. శ్రీ తులసీదాస్ మానవాళికి అందించిన హనుమాన్ చాలీసా జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ ఒడిసిపట్టాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతిమైన జీవితం సాకారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రవచనాలు అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీసులు తీసుకున్నారు.

వాలెంటైన్ డేను బహిష్కరించండి



మాట్లాడుతున్న జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు

సీతమ్మధార : ఈనెల 14వ తేదీన వాలెంటైన్ డేను బహిష్కరించాలని కోరుతూ ద్వారకానగర్‌లోని ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ జనజాగరణ సమితి స్వచ్ఛమైన ప్రేమకు, ప్రేమికులకు, ప్రేమ పెళ్లిళ్లకు వ్యతిరేకం కాదని, ప్రేమికుల రోజు పేరుతో జరిగే విచ్చలవిడితనానికి, నకిలీ ప్రేమికులకు, అమ్మాయిలపై జరిగే హింసకు, మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకమన్నారు. రోమ్ దేశానికి చెందిన సెయింట్ వాలెంటైన్‌ను ఉరి తీసిన రోజును ప్రేమికుల రోజుగా జరుపుకోవాల్సిన గత్యంతరం మనకు లేదన్నారు. దేశంలో మల్టీనేషనల్ కంపెనీలు తమ వ్యాపారాలు పెంచుకోవడానికి ప్రేమికుల రోజు అనే విదేశీ విష సంస్కృతిని ఎరగా వేసి విద్యార్థి, యువతపై బలవంతంగా రుద్దుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా ప్రేమికుల రోజును బహిష్కరించి భారతీయ సంస్కృతిని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ చింతపల్లి సునీల్‌కుమార్, శ్రీహరి, కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

12న ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిూస్ యూనియన్ వార్షికోత్సవం

డాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిూస్ యూనియన్(1104 యూనియన్) 74 వార్షికోత్సవం ఈ నెల 12న నిర్వహించనున్నట్టు యూనియన్ ప్రతినిధి గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు ఉదయం 9 గంటలకు యూనియన్ కార్యాలయం వద్ద పతాకావిష్కరణతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి నగరంలోని హోటల్ గ్రీన్ పార్క్ ఎదురుగా గల విద్యుత్ శాఖ భవన్‌లో గల విద్యుత్ కళాభారతి ఆడిటోరియంలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్‌చే పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మెడికవర్ ఆస్పత్రి, గాదం డెంటల్ ఆస్పత్రి, అగర్వాల్ నేత్ర వైద్య బృందంచే వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సభ్యులందరికీ సాధారణ పరీక్షలతో పాటు గుండె, ఎముకల వైద్యుల సూచనపై అవసరమైన ఖరీదైన పరీక్షలు కూడా ఉచితంగానే ప్రముఖ వైద్య నిపుణులతో నిర్వహించనున్నట్టు చెప్పారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రముఖ క్యాన్సర్ నిపుణులచే అవగాహన సదస్సుతో పాటు మధ్యాహ్నం 12 గంటలకు ప్రేమసమాజం అనాథలు, దివ్యాంగులు, వృద్ధులకు అన్నసమారాధన, సాయంత్రం 6.30 గంటలకు పోలీస్ బ్యారెక్స్‌లో గల పాపాహోమ్ పిల్లలకు అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు గణపతి తెలిపారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే హక్కు ఎవరిచ్చారు?

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు 1045 రోజులకు చేరుకున్నాయి. శనివారం నాటి దీక్షల్లో ఆశ వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.మేరి మట్లాడుతూ ఎంతో మంది ప్రజల త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేసే హక్కు మోదీకి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను స్థాపించలేదన్నారు. కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడమే ధ్యేయంగా మోదీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దేశ ప్రగతిలో ముందుండే ప్రభుత్వ రంగ సంస్థలను కలిసికట్టుగా రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. దీక్షలో యూనియన్ అధ్యక్షురాలు పి.మణి, కోశాధికారి వై.సీతారత్నం, సరోజిని, కె.ఆదిలక్ష్మి, కె.నవ్య, బి.లీలావతి, పి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. నృసింహుని నిత్య కల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉదయం 9.30గంటలకు ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నేటి నుంచి షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో నార్త్ షిర్డీ సాయాబాబా

ఆరిలోవ: చినగదిలిలో నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకలు ఈనెల 13 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రతి రోజు ఉదయం 5 గంటలు నుంచి స్వామి పూజా కార్యక్రమాలు ప్రారంభమవు తాయని ఇక్కడ అర్చకులు భక్తులతో పూజలు చేయిస్తారని ఆలయ చీఫ్ ట్రస్టీ వానపల్లి అప్పారావు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు సామూహిక సాయిసత్య వ్రతాలు జరుగుతాయన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు మహా అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేరోజు సాయంత్రం 6 గంటలకు స్వామివారి పల్లకీ సేవ నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామి సేవలు పాల్గొనాలని ఆయన కోరారు.